విజయ గర్వము

[క థా ని క]

శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి

"నంబరు గలవ పేపరు ఎవరిది?"

అని హైస్కూలు హెడ్‌మాస్టరయిన గోవింద రావుగారు స్కూలు ఫైనలుక్లాసుపిల్లలను అడిగాడు.

ఆయన కెదురుగా బల్లమీద వనజాక్షి, ఆమె తరువాత ఆరుగురు విద్యార్థినులూ కూర్చున్నారు. ఈబల్లవెనుక పదిబల్లలమీద విద్యార్థినులు వరుసగా కూర్చున్నారు. క్లాసు చాలా నిశ్శబ్దముగా ఉన్నది. క్రిందటివారములో జరిగిన వ్యాసరచనపోటీఫలితాలు తెలిసే దిన మది. దానిలో ప్రథములుగా వచ్చినవారికి బహుమానముగా గాంధీజీబొమ్మ చెక్కిన అరతులము బంగారుపతకము ఇస్తారు. బహూకరింపబడినవారికే కాకుండా, ఆస్కూలుకుకూడా ఎంతో ఖ్యాతి వస్తుంది. అంతటి అత్యద్భుతమైన మేధావు లెవరో - ఎవరు నోచుకున్నారో ఆ బహుమానానికీ, ఆ ఖ్యాతికీను!

హెడ్‌మాస్టరు అడిగిన ప్రశ్నకు "ఎవరిది— ఎవరిది" అనే సందేహపుప్రశ్నలు ప్రతివారికీ కలిగి, దానికి జవాబు ఎవరు ఇస్తారో—ఎవరిద గలవ నెంబరు పేపరో అని విద్యార్థినులందరూ అప్పటికప్పుడే తలలు త్రిప్పి చూస్తున్నారు.

వనజాక్షి తలను త్రిప్పకుండా తన విశాలనయనాలనుమాత్రము ఇటు అటు త్రిప్పి దృక్కులు సారించింది.

"గలవ నంబరు గల పేపరు నాదండీ" అని ఒక సన్నని కంఠము నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఆగదిలో నాలుగు మూలలా విహరించింది.

దాదాపు నూటపాతికమంది విద్యార్థినులు సమావేశమయిన ఆ హాలులో ఆబాలికసన్నని కంఠధ్వని మారుమ్రోగింది.

చివరిబల్లదగ్గరనుండి తెల్లటి చీరెను ధరించిన ఒక బాలిక మందగమనముతో హెడ్‌మాస్టరును సమీపించి నమస్కరించింది.

"నీపేరేమిటమ్మా" అన్నారు ఉపాధ్యాయులు.

"నాపేరు పద్మావతి" అని అక్కడే నిలబడిపోయిందాబాలిక.

"మన స్కూలులో క్రిందటివారము జరిగిన 'యంత్రయుగము' అనే వ్యాసరచనపోటీలో ప్రథమురాలుగా పద్మావతి వచ్చింది. ఇదివరలో నిశ్చయించినట్లుగా బంగారుపతకము యివ్వటమే కాకుండా రెండు సంవత్సరములవరకు విద్యార్థివేతనము నెలకు ౨౦ రూపాయలచొప్పున ఈబాలికకు ఇవ్వవలసినదిగా మన పాఠశాలఅధ్యక్షులు సెలవిచ్చియున్నారు. ఈసందర్భములో కుమారిపద్మావతిని అభినందిస్తూ, తక్కిన విద్యార్థినులను ప్రోత్సహిస్తున్నాను" అంటూ హెడ్‌మాస్టరుగారు విద్యార్థినుల నమస్కారములను అందుకొని ఆగదినుండి వెళ్ళిపోయినారు.

బాలికలందరూ పద్మావతిచుట్టూ చేరి "మాకు విందు ఎప్పుడు చేస్తావు పద్మావతీ? బహుమానము

సంపాదించుకొని ఇంటికి వెళ్లుదామని చూస్తూన్నావేమో" అంటూ ఆ బాలికకు ఊపిరిసలుపకుండా చేశారు.

వనజాక్షి కూర్చున్న చోటినుండి కదలలేదు. కాని జరుగుతున్న సందడినంతా గమనిస్తూనేఉన్నది. జరిగినదానికి ఆమెకన్నులు జపాకుసుమా లయినవి. ఆమెవిశాలఫాలభాగముమీద తిలకమునకు మారుగా అంటించుకున్న టిక్లీ ధూర్జటిమూడవనేత్రమువలె మెరయజొచ్చినది. తత్తరపాటువలన ఆమెజడలు రెండూ త్రుళ్ళిన త్రాచులవలె గళమునకు రెండు ప్రక్కలా కదలసాగినవి. ముఖమునకు అద్దిన పూత కరుగజొచ్చినది. అరకాళ్లు చెమర్చినవి.

స్కూలువిడిచిన ఒక గంటకు బాలికలందరూ ఇళ్ళు చేరుకున్నారు.

అందరూ వెళ్లినతరువాత వనజాక్షి మెల్లగా లేచి పాఠశాలఆవరణములో తనకొరకు ఎదురుచూస్తూఉన్న కారులో కూర్చుని డ్రైవరుకొరకు హారన్ మ్రోగించింది.

* * *

పద్మావతి ఒక పేదబాలిక. గుమాస్తాజీతముతో జీవితముగడుపలేక ప్రపంచమహాయుద్ధసమయములో ఆమెతండ్రి సైన్యములో చేరిపోయినాడు. రెండు సంవత్సరాలవరకూ ఆయన పంపుతున్న పైకము చేరుతూవచ్చింది. అటుతరువాత ఆయననుగురించిన వివరాలు వీళ్ళకు తెలియలేదు. డబ్బు రావటముకూడా ఆగిపోయింది. తరువాత చాలాకాలానికి అతని జీతము బాలూకు పైకము, బట్టలు సర్కారువారు పంపివేసినారు.

ఏకైకపుత్రికను ఆధారంగా చేసుకొని పద్మావతి తల్లి సుందరమ్మ ఆఊరు చేరింది. కూతురు పరీక్ష ప్యాసుకాగానే ఏదో ఒక ఉద్యోగములో చేర్పింపవచ్చునని ఆమె సంకల్పించింది.

పద్మావతి స్కూలునుంచి ఇంటికి రాగానే తల్లితో తన బహుమానపువార్త చెప్తూ "అమ్మా! నేను క్రిందటినెలలో విద్యార్థి వేతనముకొరకు ఇచ్చిన దరఖాస్తువల్ల, నాకు నెలకు ఇరువదిరూపాయల వేతనము ఇకనుంచి ఇస్తారట. ఈ వ్యాసరచనపోటీలో గెల్పొందినందువల్ల బంగారుపతకము ఇస్తున్నారమ్మా. ఇంక రెండేళ్ళవరకు నాచదువువిషయములో నిశ్చింతగా ఉండవచ్చును" అంటూ తల్లిపాదాలకు నమస్కరించింది.

"ఈ బాలికనూ, విద్యాభివృద్ధినీ చూచి ఆనందించే భాగ్యము తండ్రికి లేకపోయెగదా" అని ఆ మాతృదేవి కన్నులు చెమ్మగిల్లినవి.

* * * *

మధ్యాహ్నము పన్నెండుగంటల సమయము. స్కూలుపిల్లలకు విడుపువేళ.

విద్యార్థినులు భోజనాలు చేయటానికి రేకులతో షెడ్డును క్రొత్తగా వేశారు. పిల్లలందరూ టిఫిన్ కారియర్లతో అక్కడికి చేరుకుంటున్నారు. కొంతమందికి ఇళ్లదగ్గరనుండి అప్పుడే నౌకర్లు భోజనము తెస్తున్నారు.

పద్మావతి తన వెంబడి తెచ్చుకున్న ఫలహారపు డబ్బాను చేతపట్టుకుని షెడ్డులోనికి వచ్చింది.

కొన్నిదినాలనుంచీ తోడివిద్యార్థినులెవరూ ఆమెతో సంభాషించటము లేదు. ఆమె డబ్బాతో షెడ్డులో ప్రవేశించగానే అందరూ కలిసి ఒక్కపెట్టున పెద్దగా నవ్వారు.

ఏదో ఆలోచిస్తూవస్తూఉన్న పద్మావతి, వాళ్ల నవ్వుతో, తలయెత్తి ఒకసారి వాళ్లందరినీ వీక్షించింది. తిరిగి తల వంచుకొని దీర్ఘాలోచనతో ఒక బల్ల మీద కూర్చుని జొన్నరొట్టెను తుంపుకొని తినుటకారంభించింది. అవతలవారి భోజనా లయినవి కాబోలు ఆటలలోకి దిగినారు. చేతులు తుడుచుకున్న తువ్వాలును ఉండగా చుట్టి బంతి ఎగురవేసినట్లుగా ఒకరి చేతిలోనుంచి ఇంకొకరు అందుకొంటూ ఎగురవేస్తున్నారు.

పద్మావతి రొట్టె తింటున్నది. చల్లారి బిగిసిపోయిన జొన్నరొట్టెను తినటము కష్టమైన పని. ఫలహారము చేసినతరువాత విడుపుసమయములో సంగీతసాధన కావలసియున్నది. అదిగాక పరీక్షలు దగ్గరికి వచ్చినవి కాబట్టి చదువుకోవలసినది చాలా ఉన్నదనే బెదురు మనసులో ఒక పక్కన ఉన్నది.

ఇంతలో అవతల ఆటలాడుతున్న విద్యార్థినుల చేతులలోనుంచి ఉండచుట్టిన తువ్వాల వచ్చి పద్మావతిరొట్టెడబ్బామీద పడి, ఆమె తింటూతింటూఉన్న రొట్టెను మట్టిపాలు చేసివేసినది.

తల పైకెత్తి వ్యవహారము గ్రహించిన పద్మావతి డబ్బా దులిపి మూతపెట్టుకొని అక్కడినుంచి వెళ్ళి సంగీతసాధనకొరకు అనువైన గదిలోకి వెళ్ళిపోయింది.

అరగంటతరువాత ఆమె గదిబయటికి వస్తుంటెగా ప్రక్కగదిలోనుంచి స్పష్టంగా మాటలు వినిపించినవి.

"మీరు నిజమనుకున్నా సరే, అబద్ధమనుకున్నా సరే నేను చూసినది అక్షరాలా నిజము. ఆ పేపర్లన్నీ మీరు ఎవరిచేత దిద్దించినారో—వారిదగ్గరికి రెండు పూటలా పద్మావతితల్లీ, పద్మావతీ వెళ్లుతూఉండే వారు. వాళ్లు చెప్పి మార్కులను వేయించుకొన్నారు. ఈ బూటకపు వ్యవహారానికి మీరు పతకము ఇచ్చి గొప్పగా సన్మానిస్తున్నారు. కానీయండి. ఆపిల్లకు సహాయముచేయాలని మీమనసులో ఉంటే వేరొక విధముగా చేయకూడదూ" అన్న వనజాక్షిమాటలు పద్మావతిహృదయానికి ములుకులవలె తాకినవి.

వ్యాసరచనపోటీ జరిగినదగ్గరనుండి వనజాక్షి వైఖరి పద్మావతికి సందేహంగానే ఉంటున్నది. అంతకు పూర్వము మనసువిప్పి మాట్లాడకపోయినా ఇంత వైముఖ్యము లేకుండాఉండేది. తాను పట్టుచీర కట్టుకున్నదానికంటె పద్మావతి సాదాచీరకు రెండు మూడు చినుగులు కనబడితే ఆమెకు మహా సంతృప్తి కలిగేది.

"ఆ పద్మావతి అటువంటిది కాదు. నాకు బాగా తెలుసు. వాళ్ళు రెండుపూటలా ఎవరింటికి వెళ్ళగా నీవు చూశానంటున్నావో—వారికి కాదు మేము పేపర్లు యిచ్చినది. నీవు పొరబడుతున్నావు వనజాక్షీ !" అని హెడ్‌మాస్టరుగారు అంటున్నారు.

ఈమాటలన్నీ స్పష్టంగా విని పద్మావతి వికలమయిన మనస్సుతో క్లాసులోకి వెళ్లి కూర్చున్నది.

* * *

ఆసాయంత్రము ఆరుగంటల సమయములో వనజాక్షీ, ఆమెతల్లీ హెడ్‌మాస్టరుగారింటికి వెళ్లారు. ఆయన ఎదురుగా వచ్చి స్వాగతమిచ్చి లోపలికి తీసుకొనివెళ్ళారు.

వాళ్లు ఏపనిమీద వచ్చారో, తన కేవిధమైన ఉత్తరువు లిస్తారో నని ఆయనహృదయములో ఆందోళన బయలుదేరింది. మేఘగర్జనముతరువాత పిడుగుపాటున కెదురుచూసినట్లుగా వాళ్ళ రాకతరువాత పెద్ద అవాంతరము వచ్చితీరుతుందనే భయము కలిగింది ఆయనకు.

"ఏమిటండీ ! అమ్మాయి రేపటినుంచీ మీస్కూలుకు రానంటున్న దేమండీ" అని వనజాక్షితల్లి అన్నది.

ఏదో తనమీద తల్లికి చాడీ చెప్పిఉంటుందని హెడ్‌మాస్టరుగారికి తెలిసిపోయింది. అప్పటికి ఆయనకు స్ఫురించింది పద్మావతివిషయములో వనజాక్షి కేదో అసంతృప్తి కలిగిందని.

"ఏమిటమ్మా వనజాక్షి ! నీ కేమి కష్టము కలిగింది ? నాతో చెప్పమ్మా" అన్నారు.

వనజాక్షి నేలచూపులు చూస్తూ తల పైకెత్త లేదు.

"ఏమిటోనండి. ఒకరోజు సాయంకాలము స్కూలునుంచిరాగానే ఏడుస్తూ పడుకున్నది. తండ్రిగారూ, నేనూ ఎంత అడిగినా జవాబు చెప్పలేదు. ఏమిటో చిన్నబుచ్చుకుని ఇంట్లో తిరుగుతున్నది. వారు సంగతేమిటో మీదగ్గరికి వెళ్లి తెలుసుకొమ్మని అన్నారు" అన్నది తల్లి.

"ఏమిటమ్మా వనజాక్షీ! నాతో చెప్పవమ్మా" అని అడిగారు.

"నేను ఆ స్కూలులో ఇంక చదవనండీ. ముష్టిపిల్లలను మహాపెద్దవాళ్లవలె గౌరవించే చోటికి నేను ఎట్లా రావాలి! ఆ పిల్లకు అసలే కళ్లు నెత్తిమీద ఉన్నాయి. దానికితోడు మీరు చేసిన సన్మానముతో మరింత అహంకారము వచ్చి అందరినీ తృణీకరిస్తున్నది. నే నాస్కూలుకు రేపటినుంచీ రాను" అని వెక్కి వెక్కి ఏడవటము ప్రారంభించింది.

"అదిటమ్మా సంగతి? మేము ఇంకా ఆ విషయము బాగా ఆలోచించలేదుగా. నీకు వచ్చిన సందేహము అదేనా? నేను చూస్తాలే. నాతోనే చెప్పక పోయినావా! ఇంత చిన్న విషయము అమ్మగారి వరకూ పోనిచ్చావా?" అన్నారు.

రకరకాల మనస్తత్వాలు కల పిల్లలతో మెలగిన ఉపాధ్యాయుడు కావటమువల్ల వాళ్లను సమాధాన పరచి అప్పటికి పంపివేశారు. కాని ఆయన కది పెద్ద చిక్కుగా నే తోచింది. పద్మావతి బీదబాలిక అయినా ఆత్మగౌరవముగలదీ, తెలివైనదీను. ఆమె స్వయంకృషి నే చేతపైకి వస్తున్నదని ఆయనఅంతరాత్మకు బాగా తెలుసు. కాని వనజాక్షి విషయములోమాత్రము గౌరవముతో కూడిన అభిమానమువల్లనూ, పలుకుబడి గల పెద్ద అధికారికుమార్తె కావటమువల్లనూ వ్యవహారరీత్యా ఆయనబుద్ధి అంతరాత్మను గెలువవలెనని పోరాటము సాగిస్తున్నది.

*　　　*　　　*　　　*

మరునాడు క్లాసులోకి పిల్లలంతా వెళ్లుతున్నారు. పద్మావతి క్లాసుగదిలోకి వెళ్లి బల్లమీద తన స్థానములో కూర్చొనబోయినది. బల్లమీద సరిగా ఆమె కూర్చొనేచోట ముష్టిపిల్ల అని ఇంగ్లీషులో వ్రాసిన చీటీ ఒకటి అంటించబడిఉన్నది. దానిని చూసినవెంటనే ఆమెసుందరనయనాలలో నీళ్లు సుళ్లు తిరిగినవి. ఉపాధ్యాయులతో చెప్పవలెనని ఆమెకు ముందుగా తోచినదికాని, చెప్పినందువల్ల తెలియని వాళ్లకుకూడా తెలిసిపోయి అనవసరమయిన అల్లరి జరుగుతుందేమోనని జంకి వెంటనే సంక్షేపించుకొన్నది. చీటీని చింపివేసి ఆ క్లాసు అయేవరకూ అట్లాగే కూర్చున్నది. ఆమెమనసంతా చీటీని చూసిన దగ్గరనుండి వికలమయిపోయినది.

స్కూలునుంచి ఇంటికి పోతూఉండగా ఏడెనిమిదిమంది పిల్లలు ***Beggar Maid*** అని అరిచారు. ఆమె వెనుకకు తిరిగిచూడగా ఎవరూ కనబడలేదు!

ఆమె రెండుఫర్లాంగులదూరము మూడునిమిషాలలో చేరింది.

ఆరాత్రంతా కన్నుమూయకుండా తెల్లవారేవరకూ వేగించి ఒక నిశ్చయానికి వచ్చింది.

ఆమరునాడు స్కూలుకు పోయి నీళ్లునిండిన కళ్లతో క్లాసులోకి వెళ్లి, "మాస్టరుగారూ! ఈ స్కూలులో ఇంక క్షణమైనా చదవలేను. దయచేసి నాకు సర్టిఫికేటు యిప్పించండి. నే నింకా మొండిదానివలె ఇక్కడే చదివితే మా కుటుంబానికి మిగిలిన ఆ ఒక్క మర్యాదకూడా పోతుంది. నాకు సెలవు ఇప్పించరూ" అన్నది.

"ఏమిటమ్మా పద్మావతీ, కళ్లనీ ళ్లెందుకు? నాతో చెప్పు" అన్నారు ఉపాధ్యాయులు.

"నేను ఏమనీ చెప్పలేను. ఇక ఒక్కక్షణము ఆలస్యమయినా నామర్యాద కాస్తా జారిపోతుంది." అని కళ్లు ఒత్తుకున్నది.

పిల్లలంతా విషయము ఎట్లా మారుతుందోనని ఆతురతతో చూస్తున్నారు.

తాను సూచించదలచిన పథ్యము నే రోగి కోరటములో వైద్యునకు కలిగే సౌలభ్యము పద్మావతి కోరటంవల్ల ఉపాధ్యాయునికి కలిగింది!

వెంటనే ఆయన కుర్చీమీదినుంచి లేచి బయటికి వచ్చారు. పిల్లలందరికి నమస్కరించి పద్మావతికూడా బయటికి వెళ్ళింది.

"అమ్మా, పద్మావతీ! ఈ లోకములో ఎంత మంచివాళ్లకయినా మంచిపేరు రావటము కష్టము. నేను ఈ స్కూలుకమిటీవారితో మాట్లాడి నీకు ఏర్పాటయిన విద్యార్థి వేతనము ఇస్తూ మరొక స్కూలులో నిన్ను చేర్పించే ఏర్పాటు చేస్తాను. దుఃఖపడకమ్మా" అని ఆమెను ఓదార్చారు.

పద్మావతి ఆయనకు నమస్కరించి గేటువైపునకు నడక సాగించింది.

టిష్యూచీరెను ధరించిన వనజాక్షి బిరుసెక్కిన ముంగురులు ముఖముమీదికి జారగా తల పంకిస్తూ విజయగర్వముతో వికటాట్టహాసము చేయటము సాలగు బారల దూరాన ఉన్న పద్మావతికి వినబడింది.